క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక


భిక్షపతిగౌడ్

టేకుమట్ల : సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కుందనపల్లికి చెందిన పొన్నం భిక్షపతి గౌడ్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ నిరంతరం సంఘ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

12న ఎంపిక క్రీడలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక క్రీడలు ఈనెల 12న నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్, ఎంఈఓ కోడెపాక రఘుపతి, కో కన్వీనర్ సూదం సాంబమూర్తిలు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ క్రీడల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 కేటగిరిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు ఈ క్రీడలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నూకల లింగయ్య, బండి ప్రసాద్, స్వరూప రాణి, గాజర్ల శ్రీనివాస్, ఉమ, వెన్నెల, శారద, అశోక్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఏటూరునాగారం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని మహిళా సాధికారత కేంద్ర జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి హాజరై మాట్లాడుతూ గృహ హింస చట్టం-2005, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013, వరకట్న నిషేధ చట్టం -1961, అనైతిక రవాణా నివారణ చట్టం-1956 చట్టాలను తెలుసుకుంటే ధైర్యంగా పోరాటే సత్తా ఉంటుందన్నారు. చదువుతోపాటు సమాజంలోని మంచి చెడులను గ్రహించాలన్నారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ లీగల్ మేకల మహేందర్, స్పెషలిస్టు ఇన్‌ఫైనాన్సియల్ లిటరసీ శిరీష, తాత్కాలిక ఇన్‌చార్జ్ లెక్చరర్ శ్రావణి, పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

ములుగు రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని తెలిపారు. సోమవారం రాయినిగూడెం, సర్వాపూర్, అంకన్నగూడెం గ్రామాల్లో మహిళా కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. రాయినిగూడెం అధ్యక్షురాలిగా వజ్జ పద్మ, సర్వాపూర్ అధ్యక్షురాలిగా ఎర్రోజు నిర్మల, అంకన్నగూడెం అధ్యక్షురాలిగా మేకల యశోదలను ఎన్నుకున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

నిఘా నీడలో పల్లెలు
- గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


రంగాపురంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, పోలీసులు (ఫైల్)


స్తంభానికి అమర్చిన సీసీ కెమెరాలు

మొగుళ్లపల్లి : నేరాల నియంత్రణకు మొగుళ్లపల్లి పోలీసులు నడుం బిగించారు. ఇప్పటికే నేరస్తులను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. గ్రామాల్లో జరుగుతున్న నేరాల నియంత్రణకు పోలీసులు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నిఘా నేత్రాలు నేరాలకు కళ్లెం వేయడానికి దోహద పడుతున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు చేసేందుకు ఆకతాయిలు భయపడుతున్నారు. దీంతో గ్రామాల్లో నేరాల సంఖ్య అదుపులోకి వచ్చింది. అలాగే వాహనాల దూకుడు, అతివేగం తగ్గింది. అసాంఘిక కార్యకలాపాలు అదుపులోకి వస్తున్నాయి. తప్పుచేస్తే తగిన మూల్యం తప్పదనే భద్రతభావం సీసీ కెమెరాల ఏర్పాటుతో పెరుగుతోంది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాలతో బైక్ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు.

సీసీ కెమెరాలపై అవగాహన

మండలంలోని రంగాపురం, మొట్లపల్లి, మొట్టుపల్లి, వేములపల్లి, గుడిపహడ్, పోతుగల్లు, మొగుళ్లపల్లి, గణేష్‌పల్లి గ్రామాల్లో స్థానికుల సహకారంతో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీఐ మల్లేష్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నిత్యం నిఘా ఏర్పాట్లు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చని ఎవరైనా నేరాలకు పాల్పడితే సీసీ పుటేజీల ద్వారా వారిని గుర్తించవచ్చు.రోడ్డు ప్రమాదాలు ఇతర నేరాల కారణాలను తెలుసు కోవచ్చు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని వాటిని కూడా వినియోగంలోకి తెస్తామని పోలీసులు చెబుతున్నారు.

స్థానికుల సహకారంతోనే..



మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. స్థానికులు తోడ్పాటును అందిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. గ్రామస్తుల సహకారం అవసరం.

– అశోక్ ఎస్సై, మొగుళ్లపల్లి

అక్షరాస్యతే అన్నింటికీ మూలం


మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి

మొగుళ్లపల్లి : అక్షరాస్యతే అన్నింటికీ మూలం అని స్థానిక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'అక్షరాస్యత ప్రాముఖ్యతపై' ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, స్లొగన్స్ రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరక్షరాస్యులైన తమ తల్లిదండ్రులతో పాటు, తమతో పాటు సమాజంలో నివసిస్తున్న నిరక్షరాస్యులను గుర్తించి విద్య నేర్పించాలని సూచించారు. నేటి సమాజంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, రవీందర్, కొమురెల్లి, దేవేందర్, చందర్, ఎమ్మార్సీ, సీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపు కరువు


కాలనీలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న రామిళ్ల కిరణ్, రాజబాబు

కాటారం: సబ్ డివిజన్ ప్రధాన కూడలిగా ఉన్న కాటారం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిపోయిందని, నిర్వహణ గూర్చి పట్టించుకునే వారే లేరని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలను పరిశీలించిన కిరణ్ పారిశుద్ధ్య నిర్వహణ లోపం తీవ్రంగా ఉందని మండిపడ్డారు. కాలనీల్లో రహదారుల వెంట పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగాయని, రోడ్లపై మురుగునీరు నిలుస్తుందని తెలిపారు. పందులు స్వైర్య విహారం చేస్తూ ఆగమాగం చేస్తున్నాయన్నారు. పారిశుద్ధ్యం లోపంతో జీపీ పరిధిలోని ప్రజలు విష జ్వరాల బారినపడుతున్నారని పేర్కొన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయలేదని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలంలో ఇలాంటి దుస్థితి ఉంటే ఇతర మండలాల పరిస్థితి ఏమిటోనని ప్రజలు ఆలోచించాలని అన్నారు. గ్రామపంచాయతీలపై ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పారిశుద్ధ్య పనుల నివారణకు నిధులు కేటాయించి పకడ్బందీ నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కిరణ్ వెంట బీఆర్‌ఎస్ నాయకులు మానెం రాజబాబు ఉన్నారు.

భూమి మానవాళి మనుగడకు భరోసా


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

కాళేశ్వరం : విశ్వంలో లక్షలాది నక్షత్ర మండలాలు, వాటిలో లక్షలాది గ్రహాలు ఉన్నా అందులో మానవాళి మనుగడకు సాగిస్తున్నది భూగోళం ఒక్కటే అని గుర్తిస్తే మానవాళి భవిష్యత్‌కు భరోసా ఉంటుందని పర్యావరణ ప్రేమికుడు జేవీఎస్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం, భూగోళంపై సమస్త ప్రకృతి వ్యవస్థలను పరిరక్షిస్తూ వాటిని భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించాలనే లక్ష్యంతో ప్రపంచ దేశాలు పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవాన్ని ×ఒకే ఒక్క భూమి× అనే నినాదంతో పర్యావరణ సమతుల్యత కోసం అందరూ నడుం బిగించి భూమాత పరిరక్షణ సుసాధ్యం చేసుకోవాలని ఐక్య రాజ్యసమితి పిలుపునిచ్చింది. సహజ వనరుల వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. జనాభా పెరుగుదల, నగరాల విస్తరణ, అడవుల తరుగుదల, వాతావరణ మార్పుల మూలంగా భూమాత మనుగడ కష్టకాలంలో పడింది. భూగోళంపై అరుదైన, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలను వేగంగా కోల్పోతున్నాం. అటవీ వనాల పెంపకం వాతావరణ మార్పుల కోసం రూపు దిద్దుకోవాల్సిన ప్రణాళికలు, నిర్దిష్ట చర్యలు, నిధుల కేటాయింపు వంటి అంశాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొనసాగించాలి. పర్యావరణ అంశాలను పరిరక్షించే చర్యలను ముమ్మరంగా చేయాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూలంకశంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజేందర్, సువర్ణ, జ్యోతి, శ్రీధర్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు సమావేశం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టడానికి కాళేశ్వరం దేవస్థానం ఈఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మూడు రోజుల్లో కోతులు పట్టేవారు రానున్నారని తెలిపారు. కాళేశ్వరాలయం, పంచాయతీ, దాతల సాయంతో కోతులు పట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

మొగుళ్లపల్లి : ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆన్‌లైన్ వర్క్ నుంచి ఏఎన్‌ఎంలను తొలగించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించి మండల వైద్యాధికారి నాగరాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ ఎన్‌సీడీ ప్రోగ్రాంలో స్క్రీనింగ్ టెస్టులతో పాటు ఆఫ్‌లైన్‌లో రిపోర్ట్ తయారు చేయాలని తెలిపారు. ఫీల్డ్ వర్క్‌తో పాటు ఆన్‌లైన్ పనిచేయలేమని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సువర్ణ, సునిత, భారతి, సునిత, సబితబేగం, సులోచన, శ్రీలత, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

కాటారం: ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో శ్రీఅయ్యప్ప ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫొటో టెక్ అండ్ ఎడిట్ పాయింట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, కుటుంబ పరిస ఇన్‌చార్జ్ తొంబర్ల రాజేంద్రప్రసాద్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్యామ్, మండల అధ్యక్షుడు గుమ్మడి సందీప్, ఉపాధ్యక్షులు తోట మాధవ్, ప్రధాన కార్యదర్శి రాజబాబు, కోశాధికారి నరేందర్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు అపహరణ

- ఇద్దరి అరెస్ట్
- ఆరు మోటార్లు, రూ.20వేలు స్వాధీనం


దొంగల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల : జల్సాలకు అలవాటు పడి రైతులు వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను దొంగిలించిన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్‌లు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం జగ్గయ్యపేటకు చెందిన దబ్బెట రమేష్, తిరుమలగిరికి చెందిన సరిగొమ్ముల వెంకటస్వామిలు జల్సాలకు అలవాటు పడి రేగొండ మండలంలోని తొమ్మిది, చిట్యాల మండలంలోని చల్లగరిగలోని ఒక మోటార్లను అపహరించారు. ఈ క్రమంలో నాలుగు మోటార్లను రెండు రోజుల క్రితం అమ్ముకున్నారు. మిగిలిన ఆరు మోటర్లను మొగుళ్ళపల్లిలోని పాత ఇనుప సామానులో అమ్ముకుందామని వెళ్తుండగా చిట్యాల మోడల్‌స్కూల్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను విచారించగా దొంగతనం విషయం బయటపడింది. దీంతో వారి నుంచి గతంలో మోటార్లు అమ్ముకున్న డబ్బుల్లో ఖర్చుల అనంతరం రూ. 20వేలు, ఆరు మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై సమ్మిరెడ్డి, సురేందర్, సందీప్, అస్లాంజానీ, నాగరాజులను సీఐ అభినందించారు.

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా స్థాయి కళాఉత్సవ్ ప్రదర్శనలు చేపట్టగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు నృత్యం, సంగీతం, కథలు, స్కిట్లు, చిత్రలేఖనం, కళాత్మక రూపాలు 12 అంశాల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన అంశాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి కాగిత లక్ష్మణ్, సీఎంఓ సామల రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు కళల్లోనూ రాణించాలని అన్నారు. లక్ష్యం పెట్టుకొని నిరంతరం సాధన చేయాలన్నారు. భారత ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ విద్యార్థులలో కళాత్మకతను పెంపొందించడానికి 'కళా ఉత్సవ్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా నాని, తౌటం స్వామి, వంగపల్లి శంకర్, వడ్లూరి ఈశ్వరాచారి, ఠాకూర్ శిరీష, చిట్టంపల్లి సాహిత్య, ప్రగతి, వెంకటేష్, చందర్ వ్యవహరించారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం


కాళేశ్వరం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రనాథ్


మల్హర్ : నాయకులకు జాబితా వివరాలు తెలుపుతున్న ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి


కాటారం : రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

మొగుళ్లపల్లి : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ సురేందర్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు ముసాయిదా జాబితాపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశం

మల్హర్ : రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు ఈనెల 6న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా జాబితాను అధికారులు మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రచురించిన విషయం తెలసిందే. కాగా మండలంలో మొత్తం ఓటర్లు 22,446 ఉండగా (పురుషులు 10,967, మహిళలు 10,479) వారితో ప్రచురించిన పోలింగ్ స్టేషన్ ముసాయిదా జాబితా అభ్యంతరాలపై ఎంపీడీఓ కార్యాలంలో వివిధ పార్టీ నాయకులతో ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన నాయకులు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, కేసారపు చంద్రయ్య, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కోట రవి, ఏ మధుసూదన్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

కాళేశ్వరం/కాటారం: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, ముసాయిదా ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో మండల కేంద్రాల్లో ఎంపీడీఓలు రవీంద్రనాథ్, బాబు, శ్రీనివాస్‌రావు కాళేశ్వరం తహసీల్దార్ రామారావులు సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటరుజాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎంపీడీఓలు పార్టీల నాయకులకు తెలియపర్చి అభ్యంతరాలు అడిగారు. ఎలాంటి అభ్యంతరాలు రాలేదని వారు పేర్కొన్నారు. సవరణల అనంతరం తుది జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏటూరునాగారం/వాజేడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీల ముసాయిదా ఓటరు జాబితాలను సోమవారం ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శించి ఆయా పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓలు శ్రీనివాస్, శ్రీకాంత్‌నాయుడు తెలిపారు. మండల స్థాయి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. వార్డుల్లో తప్పిపోయిన ఓటర్లు, డెత్ కేసుల వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు


సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో అధికారులు


ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీడీఓ, ఎంఈఓ


కాళేశ్వరం : అవార్డు తీసుకుంటున్న పీడీ పూర్ణిమ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ అవార్డులను సోమవారం అందజేశారు. మండల కేంద్రంలో బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న పీడీ గుర్సింగ పూర్ణిమ, కాళేశ్వరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెంటి శ్యామ్, సీఆర్‌పీ పెంటి సతీష్‌లకు ఉత్తమ సేవలకు అవార్డును జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, ఎంఈఓ ప్రకాశ్‌బాబుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీధర్, మడక మధు, శంకర్, రమేష్, రాజయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు : తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా

చిట్యాల : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులని తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా, ఎంపీడీఓ జయశ్రీలు అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కోడెపాక రఘుపతి ఆధ్వర్యంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే కీలకం అన్నారు. పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయలపై ఉందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో విశిష్ట సేవలను అందించిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం మంచి అనుభూతి అన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మందికి శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గోల్కొండ బిక్షపతి, ఝాన్సీరాణి, గిరగాని కృష్ణ, వాసంతి, రాష్ట్ర ఉత్తమ అవార్డుగ్రహీత లింగయ్య, పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా అవార్డు గ్రహీత సుధాకర్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

రేగొండ : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ వేల్పుల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలుగా జిల్లాలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని ఎంఈఓ అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్, రేగొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఐటీఐలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వావిలాల ముఖేష్ కుమార్‌ను కార్మికశాఖ మంత్రి వివేక్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఐటీఐలో ముఖేష్ కుమార్ అందించిన సేవలకు ఈ అవార్డు అందుకోవడంతో ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

యూరియా కోసం బారులు


యూరియా కోసం బారులు దీరిన రైతులు

ఏటూరునాగారం : మండలంలోని రైతులకు యూరియా బస్తాల కోసం సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద బారులుదీరారు. ఆధార్ కార్డు ఉన్న రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్రి కల్చర్, పీఏసీఎస్ అధికారులు రైతులకు అందించారు. ఈ వారం రోజుల్లో రైతులకు 888 బస్తాలను పంపిణీ చేసినట్లు ఏఓ వేణుగోపాల్ తెలిపారు. మరో 2400ల బస్తాలు వస్తే రైతులకు సరిపోతాయని, ఎవరుకూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ తెలిపారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ బందోబస్తు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.